క్లుప్తంగా

చాపరాయికి పర్యాటకుల తాకిడి



ముఖద్వారం మెట్ల వద్ద నుంచి చాపరాయికి చేరుతున్న పర్యాటకులు

డుంబ్రిగుడ: చాపరాయి పర్యాటక కేంద్రానికి ఆదివారం పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉంది. గత రెండు, మూడు వారాలుగా చాపరాయి పర్యాటకులు లేక బోసిపోయింది. తాజాగా పర్యాటకుల సంఖ్య పెరుగుతుండడంతో చిరు వ్యాపారాలు చేసుకునే గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అరకు ఫీనరీలోను వ్యాపారాలు బాగా సాగాయి.

కురిడిలో 18 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ కేంద్రంలో ఆదివారం కర్రి సూర్యనారాయణ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం రోటరీ క్లబ్, సన్‌గ్రీన్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 18 మంది గిరిజన యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ కుమార్తె శృతి, రోటరీ క్లబ్, సన్‌గ్రీన్ సిబ్బంది, కురిడి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎర్రగొండమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొయ్యూరు: ఎర్రగొండమ్మ తల్లిని ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఈ ప్రాంతంలో తల్లికి పేరుంది. దీంతో అనేక గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి వారి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలు జరిగే నాలుగు రోజుల పాటు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బొజ్జయ్య

రంపచోడవరం: రంపచోడవరం పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆదివారం వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఏటా పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీఎం కన్నబాబు, పంచాయతీ కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి వేడిమితో జనం ఇక్కట్లు



అధిక ఉష్ణోగ్రత వల్ల నిర్మానుష్యంగా మారిన కె.కోటపాడు రోడ్డు

కె.కోటపాడు: గ్రామాల్లో వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఇటీవల ఎండలతో పాటు అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ప్రజలు సేదదీరుతున్నారు. ఆదివారం అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో పాటు తీవ్ర ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజల రాకపోకలు తక్కువగా ఉండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రధాన కూడళ్ల జనసంచారం లేక బోసిపోయాయి.

అభివృద్ధికి ఆమడ దూరం..!



కొండల మధ్యలో ఉన్న కిన్నెర్లోవ గ్రామం

- రహదారి సౌకర్యం లేని కిన్నెర్లోవ గ్రామం
- అత్యవసర పరిస్థితుల్లో నానా అవస్థలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.1.80 కోట్లతో రోడ్డు పనులకు శ్రీకారం
- ప్రస్తుతం ముందుగా సాగని రోడ్డు నిర్మాణం



గుంతలతో దర్శనమిస్తున్న రోడ్డు

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ కిన్నెర్లోవ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో కొట్టుమిట్టాడుతోంది. ఎత్తైన కొండల మధ్యలో ప్రకృతి అందాలతో కళకళలాడే ఈ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హుకుంపేట–కామయ్యపేట ప్రధాన రహదారి నుంచి ఈ గ్రామానికి వెళ్లేందుకు సుమారు 4 కిలోమీటర్ల మేర ప్రయాణించాలి. గ్రామంలో ఎవరికి అనారోగ్య పరిస్థితులు తలెత్తినా డోలీ మోతలే శరణ్యం. ఈ పరిస్థితిని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ గ్రామానికి పీఆర్ నిధులు రూ.1.80 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. కొంత వరకు రోడ్డు నిర్మాణ పనులు కూడా చేపట్టింది. అనంతరం సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఆ తరువాత కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు దాటుతున్నా రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. దీంతో గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. తమ గ్రామానికి ఎప్పుడు రోడ్డు నిర్మాణం పూర్తవుతుందో అప్పుడే తమకు స్వాతంత్ర్యం వచ్చినట్టు భావిస్తామని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు తమ కష్టాలు గుర్తించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.



అధ్వానంగా రహదారి

మా కష్టాలు ఎవరికి చెప్పకోవాలి



మా గ్రామానికి రోడ్డు సౌకర్యం సరిగ్గా లేక నరకం అనుభవిస్తున్నాం. మా గ్రామం నుంచి వ్యక్తిగత పనులకు బయటికి వెళ్లాలన్నా, అత్యవసర పరిస్థితులు తలెత్తినా నానా అవస్థలుపడుతున్నాం.మా కష్టం ఎవరికి చెప్పాలో తెలియడం లేదు.

– కిల్లో సీమన్న, కిన్నెర్లోవ గ్రామం

రోడ్డు పనులు పూర్తి చేయాలి



మా గ్రామానికి రోడ్డు సదుపాయం లేక అత్యవసర పరిస్థితుల్లో పలువురి ప్రాణాలు కోల్పోయాం. ఊరు నుంచి బయటకు వెళ్లేందుకు కష్టంగా ఉంది. మధ్యలో ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి, పూర్తి చేయాలి. – కిల్లో ఆనంద్, వైస్ సర్పంచ్, తీగలవలస పంచాయతీ

ఉత్సవంలో బస, భోజన ఏర్పాట్ల పరిశీలన



చింతపల్లి వైటీసీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ వినోద్‌బాబు, హేమంత్‌కుమార్, వినాయకరావు

చింతపల్లి: చింతపల్లిలో ఈ నెల 24 నుంచి జరగనున్న ముత్యాలమ్మతల్లి ఉత్సవాలకు హాజరుకానున్న పోలీసు సిబ్బందికి పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పనకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు స్థానిక సీఐ వినోద్‌బాబు తెలిపారు. ఆయన ఆదివారం ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దురియా హేమంత్‌కుమార్, పసుపులేటి వినాయకరావు ఆధ్వర్యంలో స్థానిక యువజన శిక్షణా కేంద్రం(వైటీసీ)ను పరిశీలించారు. ఈ ఉత్సవం సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో 300 మంది సిబ్బంది హాజరుకానున్నారని తెలిపారు. వారికి భోజన, వసతి సౌకర్యం కల్పించేందుకు స్థానిక వైటీసీతో పాటు గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను, సెయింట్ ఆన్స్ పాఠశాలను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, వెంకటరమణ, వైస్ సర్పంచ్ నూరు, మాజీ వైస్ సర్పంచ్ గంజారి రమణ, రహిమాన్(బుజ్జి), తాడి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చాలి



మాట్లాడుతున్న సమరెడ్డి మాణిక్యం

పాడేరు రూరల్: నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పనుతున్నాయన్నారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండంలోని నాన్ షెడ్యూల్ పంచాయతీలైన రొంపల్లి, గుమ్మకోట, గరుగుపల్లి, భీంపోలు, ఎస్ఆర్ పురం గ్రామాలతో పాటు అనకాపల్లి జిల్లా పరిధిలో ఉన్న గొలుగొండ, నాతవరం, కోటవురట్ల మండలాల్లో కొన్ని పంచాయతీలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్మర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సమవేశంలో చేసిన తీర్మానం హర్షణీయమన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏలో నిర్వహించే పాలక మండలి సమవేశంలో స్పష్టమైన వైఖరి ప్రకటించాలన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



చింతలవీధిలో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమణ

పెదబయలు: చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆశలో పడి మోసపోవద్దని పెదబయలు ఎస్‌ఐ కె.రమణ అన్నారు. ఆదివారం పెదబయలు మండలం మారుమూల జామిగుడ పంచాయతీ గుంజివాడ, చింతలవీధి గ్రామాల్లో ఇటీవల కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారాను పూర్తిగా నిర్మూలించాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకుని వస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చిన్నారుల రక్షణ కోసం ఉన్న పోక్సో చట్టం గుర్తించి, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చేతబడి, మూఢ నమ్మకాల పేరుతో దాడులు చేయడం నేరమని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో నిరుపేదలైన వితంతువులు, బాలింతలు, వృద్ధులకు నిత్యావసర సరకులు అందజేశారు. గుంజివాడ, తరాబు, జామిగుడ, మెట్టగుడ, జోడియపుట్టు గ్రామాలకు చెందిన యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. భూషిపుట్టులో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని, జామిగుడ పాఠశాలలో 70 మంది పిల్లలు ఉంటే ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారని, మరో ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని ఎస్‌ఐ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తెరవాడ వెంకటరావు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

నర్సీపట్నం: మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును వెలగా నారాయణరావు, టూరిజం మేనేజర్ అప్పలనాయుడు ఆదివారం ప్రారంభించారు. సమ్మర్ క్యాంపునకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని నింజాస్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. పళ్లు, గుడ్లు, బిస్కట్లు, కేకులు, రాగిజావ అందజేస్తామని నారాయణరావు తెలిపారు. సీనియర్ కోచ్ మాట్లాడుతూ 40 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. కరాటే, వుషు, బాక్సింగ్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగా వంటి క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రయంలో నింజాస్ అకాడమీ డైరెక్టర్లు వెలగా జగన్నాథం, బోశెం శివ, బంగారు నాయుడు, ఉమెన్ కోచ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

23న అయ్యప్ప ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట



విగ్రహాల ప్రతిష్ట ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ ఉషారాణి, ఇతర ప్రతినిధులు

సాక్షి, పాడేరు: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఈ నెల 23న జరగనుంది. ఈ మేరకు అయ్యప్ప ఆలయ కమిటీ, పాడేరు పట్టణ పెద్దలు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. శివపరమాత్ముడు, సత్యనారాయణస్వామి, లక్ష్మీదేవి, షిరిడి సాయిబాబా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ మేరకు విగ్రహాల ప్రతిష్ట ప్రచార పోస్టర్లను పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ కొట్టగుళ్లి సుబ్బారావు, తదితరులు ఆవిష్కరించారు. విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ కార్యదర్శి రాము, మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము, వర్తక సంఘం ప్రతినిధులు బూరెడ్డి కొండబాబు, కొణతాల ప్రశాంత్, దాము, ఆదిత్య, కేజియారాణి, రాధాకృష్ణ, చిన్న పాల్గొన్నారు.

నేడు సంపంగి గెడ్డ వంతెన ప్రారంభం



మాట్లాడుతూన్న కితలంగి సర్పంచ్ సుబ్బారావు

డుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ పరిశీల రోడ్డులో కించుమండ సంతబయిలు సంపంగి గెడ్డపై నిర్మించిన వంతెనను సోమవారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ప్రారంభించనున్నారని కితలంగి సర్పంచ్ వి.సుబ్బారావు తెలిపారు. మండలంలోని అధికారులు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు పాల్గొని ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



పరికరాల వినియోగం గురించి వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

నర్సీపట్నం: అగ్నిమాపక వారోత్సవాలు ముగిసాయి. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం వారోత్సవాల ముగింపు సందర్భంగా ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా వారం రోజులపాటు సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అగ్నిమాపక శాఖ త్యాగాలు, సేవలు, ప్రజల భద్రతపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సేఫ్టీ టిప్స్ తెలియజేశారు. ముఖ్యమైన చర్యలు, ఎమర్జెన్సీ నంబర్లను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రమాద సమయంలో వినియోగించే అగ్నిమాపక పరికరాల పనితీరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అర్జున్ వెంకట్రావు, కుంచా వెంకటరమణ, రాజు, ఫైర్ సిబ్బంది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో జలకాలు ఆడేందుకు సందర్శకులు పోటీ పడ్డారు. ఎండ తీవ్రత కారణంగా వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో జలపాతం నుంచి నీటి ప్రవాహం గణనీయంగా తగ్గింది. నీరు తక్కువగా రావడంతో పెద్దలతో పాటు చిన్నారులు సైతం జలకాలు ఆడేందుకు ఉత్సాహం చూపారు. వేసవి సెలవులు కావడంతో దూర ప్రాంతాల నుంచి సందర్శకులు వాహనాలపై రావడంతో ఈ ప్రాంతం కోలాహలంగా మారింది.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు



చర్చిలో భక్తి గీతాలకు నృత్యాలు చేస్తున్న చిన్నారులు



ర్యాలీ అనంతరం క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్



కుసుమరాయుడులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఎటపాక: ఈస్టర్ పండగ సందర్భంగా మండలంలోని చర్చిల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు శిలువ మరణం పొంది మూడో రోజున ఆత్మ పూర్ణుడై తిరిగి లేచాడనే విశ్వాసంతో ఈస్టర్ వేడుకను క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. జీకే పాడు, గౌరిదేవిపేట, సీతాపురం, నందిగామ తదితర గ్రామాల్లోని చర్చిలకు ఉదయమే క్రైస్తవులు చేరుకుని మధ్యాహ్నం వరకు ప్రార్థనలు చేశారు. అంతకు ముందు తెల్లవారుజామున మహిళలు, యువకులు, చిన్నారులు కొవ్వొత్తులు పట్టుకుని వీధుల్లో సువార్త చాటారు. ముస్తాబు చేసిన క్రైస్తవుల సమాధుల వద్దకు వెళ్లి పాస్టర్‌లు ప్రార్థనలు చేశారు. పలు చర్చిల్లో చిన్నారులు క్రైస్తవ గీతాలకు నృత్యాలు చేశారు.

డుంబ్రిగుడ: మండలంలోని డుంబ్రిగుడ, కించుమండ, అరకు, గుంటసీమ, సొవ్వ తదితర ప్రాంతాలలో ఉదయం నుంచి తమ మృతుల సమాధుల వద్ద ఆయా కుటుంబ సభ్యులు ప్రార్థనలు చేశారు. పూలు, కొవ్వొత్తులు వెలిగించి స్మరించుకున్నారు. ఆయా చర్చిల్లో పాస్టర్‌లు జోనష్, భాస్కరరావు, మనషే, సుదర్శన్ తదితరులు ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు.

క్రైస్తవుల పునరుత్థాన ర్యాలీ

కొయ్యూరు: ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు ఆదివారం పునరుత్థాన ర్యాలీ నిర్వహించారు. ఏసు మరణించిన దినం గుడ్‌ఫ్రైడే అయితే ఆయన తిరిగి పునరుత్థానుడు అయిన దినంగా ఆదివారాన్ని పిలుస్తారు. రాజేంద్రపాలెం యునైటెడ్ చర్చిలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రీస్తు సందేశాన్ని ఇస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక గీతాలను ఆలపించారు.

గంగవరం: కుసుమరాయిలోని సమాధుల తోటలో దైవ సేవకులు గోళ్ళ వెంకటరత్నం ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి పాస్టర్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో శాలెం వర్షిప్ సెంటర్ చర్చిలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి ఘనంగా నివాళులర్పించి, కొవ్వొత్తులు వెలిగించి ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు.

నిర్వాసితులకు అన్యాయం చేస్తే సహించం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు పులి సంతోష్

వీఆర్‌పురం: నిర్వాసితులను గుర్తించడంలో అధికారులు విఫలం అవుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులి సంతోష్ ఆరోపించారు. పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం వీఆర్ పురంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామవరంలో పీడీఎఫ్ జాబితాలో తొలగించిన పేర్లను తిరిగి చేర్చాలని ఐటీడీఏ పీవో దరఖాస్తులు అందించామని, అయినా ఇంత వరకు జాబితాలో చేర్చలేదన్నారు. అయినా గ్రామ సభలు పెట్టి స్ట్రక్చర్ వాల్యూవేషన్ ప్రకటిస్తామని చెప్పడం సరి కాదని, ఇది నిర్వాసితులను మోసం చేయడమే అవుతుందని విమర్శించారు. నిర్వాసితులకు అనేక సందేహాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి విడనాడకపోతే నిర్వాసితులు ఆందోళనలు చేయడం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సున్నం రాజులు, సోయం చినబాబు, ఎంపీపీ కారం లక్ష్మీ, కారం సుందరయ్య, గుండిపూడి లక్ష్మణరావు, వద్దాది రమేష్, కదల కొండారెడ్డి, పొడియం శ్రీరామమూర్తి, తోడం రాజు, కమ్మచిచ్చు సత్యనారాయణ, సీరాపు తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరి



చోటముఖిపుట్టు వద్ద ఆటో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ జె.రామకృష్ణ అన్నారు. మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో ఆదివారం ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. అధిక ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ వాహనదారులను హెచ్చరించి, విడిచి పెట్టారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గించవచ్చునన్నారు. మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ప్రాణాలు కోల్పోవడంతో పాటు ఆ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. ఎంతో జాగ్రత్తగా వాహనాలు నడపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ తిరుపతిరావు, పోలీసులు పాల్గొన్నారు.

ఇటుకల పండగలో గొడుగుల ఊరేగింపు



గొడుగుల ఊరేగింపు నిర్వహిస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో పండగల సమయంలో గ్రామానికి ఒక్క ఆచారం ఉంటుంది. దానిని పాటిస్తూ పండగలను నిర్వహిస్తూ ఉంటారు గిరిజనులు. ప్రసుత్తం గిరిజన గ్రామాల్లో ఇటుకల పండగ సందడి నెలకొంది. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామంలో గిరిజనులు తమ ఆచారం ప్రకారం ఇటుకల పండగ నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం గొడుగుల ఊరేగింపు చేపట్టారు. ఎదురు కర్రలను గొడుగుల రూపంలో తీర్చిదిద్ది ఇంటింటికీ తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



డి.అగ్రహారం వెళ్లే మార్గంలో గత ఏడాది కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గూడెం నుంచి సీలేరు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి

గూడెంకొత్తవీధి: మన్యంలో రహదారులు అత్యంత దయనీయంగా మారాయి. ప్రధానంగా ఆర్వీనగర్ నుంచి సీలేరు వెళ్లే మార్గంతో పాటు దారకొండ నుంచి గుమ్మిరేవులు, మాదిగమళ్లు, కొంగపాకలు వెళ్లే పలు మార్గాలు దారుణంగా తయారయ్యాయి. అసలే గోతులమయమైన ఈ రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రహదారుల అభివృద్ధికి ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో గిరిజనులంతా అఖిల పక్ష నాయకులతో కలిసి ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా త్వరితగతిన రహదారుల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.